క్లుప్తంగా

రేపటి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

అంబాజీపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గంగలకుర్రు అగ్రహారం విత్తనాల ఇంద్రశేఖర్ స్వగృహం వద్ద శుక్రవారం ఉదయం 9 గంటలకు జరిగే బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీకి పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ పిలుపునిచ్చారు. కార్యక్రమానికి నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారన్నారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, జిల్లా, రాష్ట్ర నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని విభాగాల నాయకులు, సారథులు హాజరు కావాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

మామిడికుదురు: నగరం, మగటపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రాంబాబు బుధవారం తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. 33 కేవీ లైన్లలో ట్రీ కటింగ్, సబ్ స్టేషన్లలో మరమ్మతుల కారణంగా సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు. రెండు సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. ఈ అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పీహెచ్‌సీ వైద్యాధికారిగా భాగ్యశ్రీ



కె.భాగ్యశ్రీ

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల పీహెచ్‌సీ ద్వితీయ వైద్యాధికారిగా కె.భాగ్యశ్రీ నియమితులయ్యారు. స్థానిక పీహెచ్‌సీ కార్యాలయంలో ప్రధాన వైద్యాధికారి డి.సాయికిశోర్ సమక్షంలో బుధవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు జిల్లాలోని బుట్టాయగూడెం మండలంలోని పులి రామన్నగూడెం వైద్యాధికారిగా రెండేళ్ల పాటు పనిచేసి బదిలీపై స్థానిక పీహెచ్‌సీకి వచ్చారు. పీహెచ్‌సీ ఏర్పడిన పుష్కరకాలంలో పూర్తి స్థాయిలో తొలి మహిళా వైద్యాధికారి భాగ్యశ్రీ కావడం గమనార్హం.

పేదలకు వస్త్రదానం



వాడపల్లి క్షేత్రంలో సిబ్బందికి వస్త్రదానం చేస్తున్న సంకీర్తనాచారి శ్రీనివాసరావు

కొత్తపేట: సనాతన ధర్మప్రచార వాగ్గేయకార సంకీర్తనా వాహిని సేవా సమితి ద్వారా పేదలకు వస్త్రదానం చేశారు. ఆత్రేయపురం మండలం అంకంపాలెం గ్రామానికి చెందిన హిందూ ధర్మ ప్రచార రథసారధి, కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం సంకీర్తనాచారి కరుటూరి వెంకట శ్రీనివాసరావు బృందం ద్వారా వాడపల్లి క్షేత్రంలో స్వీపర్లకు, యాచకులకు, పేదలకు వస్త్రదానం చేశారు. అలాగే ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి వారి దేవస్థానంలో అన్నప్రసాద సేవకులకు వస్త్రదానం చేశారు. మానవసేవే మాధవసేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం రెండు ప్రాంతాల్లో సుమారు 100 మందికి వస్త్రదానం చేసినట్టు శ్రీనివాసరావు తెలిపారు.

బూటకపు హామీలతో మోసం

- కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ ధ్వజం
- పాశర్లపూడిలో మండల స్థాయి సమావేశం



పాశర్లపూడి సమావేశంలో మాట్లాడుతున్న పరిశీలకుడు చిట్టిరాజు



మట్టపర్తి నాగేంద్రను సన్మానిస్తున్న మాజీ మంత్రి సూర్యారావు

మామిడికుదురు: ఎన్నికల్లో కూటమి నేతలు బూటకపు హామీలు ఇచ్చి ప్రజల్ని మోసం చేశారని పి.గన్నవరం నియోజకవర్గం వైఎస్సార్ సీపీ పరిశీలకుడు పెనుమత్స చిట్టిరాజు, కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పాశర్లపూడిలో మాజీ సర్పంచ్ మొల్లేటి త్రిమూర్తులు స్వగృహం వద్ద పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము అధ్యక్షతన బుధవారం కార్యకర్తల సమావేశం జరిగింది. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వచ్చేందుకు బాబూ ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వంలో అన్ని రంగాల వారు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ప్రస్తుతం అమలు చేస్తున్న అరకొర పథకాలు వైఎస్సార్ సీపీ పోరాటంతోనే అమలుకు నోచుకున్నాయన్నారు. రాష్ట్రంలో పరిస్థితులు చాలా దారుణంగా ఉన్నాయన్నారు. హత్యలు, మానభంగాలు, హింస, గంజాయి స్మగ్లింగ్ విచ్చలవిడిగా జరుగుతున్నా వాటిని అదుపు చేయడంలో పాలక పక్షం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రతిపక్షాన్ని టార్గెట్ చేయడం, అక్రమ కేసులు బనాయించడం తప్ప సంకీర్ణ ప్రభుత్వం సాధించింది శూన్యమన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, పార్టీ నాయకులు మందపాటి కిరణ్‌కుమార్, కుసుమ శ్రీధర్, నెల్లి దుర్గాప్రసాద్, చిక్కం బుజ్జిబాబు, తోరం సూర్యభాస్కర్, తోరం గౌతమ్, కాంద్రేగుల బాబి, చిట్టూరి రామకృష్ణ, వాసంశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజోలులో గెలుపే లక్ష్యం: మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాజోలు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుదామని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. మలికిపురం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రాజోలు నియోజకవర్గ పరిశీలకుడిగా నియమితులైన మట్టపర్తి నాగేంద్ర గొల్లపల్లి సూర్యారావును బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. పార్టీ జెండా ఎగురవేశారు. గొల్లపల్లి సూర్యారావు ఆధ్వర్యంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు నాగేంద్రను అభినందించారు. అనంతరం గొల్లపల్లి మాట్లాడుతూ కూటమి అరాచకాలను ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు సూచించారు. మండల స్థాయి, గ్రామస్థాయిలో జరగబోయే 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' కార్యక్రమాల నిర్వహణకు ఇప్పటికే కమిటీలు వేశామని, త్వరలోనే వీరి ద్వారా ఈ కార్యక్రమాలను మండల అధ్యక్షుల పర్యవేక్షణలో ముందుకు తీసుకు వెళ్తామని చెప్పారు. ఎన్నికల్లో బూటకపు హామీలు ఇచ్చిన చంద్రబాబు వాటిని అటకెక్కించారని విమర్శించారు. జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రుద్రరాజు చిన్నారాజా, పార్టీ సీనియర్ నాయకులు కేఎస్ఎన్ రాజు, కంచర్ల శేఖర్, కటకంశెట్టి ఆదిత్య, కుసుమ చంద్రశేఖర్, కట్టా శ్రీను, అడబాల బ్రహ్మాజీ, బొలిశెట్టి భగవాన్, తోటే జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



ఆలమూరులో మహిళా చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ మురళీమోహన్

ఆలమూరు: మహిళల కోసం రూపొందించిన చట్టాల పట్ల ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచి అవగాహన పెంపొందించుకోవాలని కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ కోరారు. ఆలమూరు సిద్ధార్థ హైస్కూల్‌లో బుధవారం 'మహిళలు సంరక్షణ' అనే అంశంపై విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు జరిగింది. సమావేశానికి కరస్పాండెంట్ కె.ముల్లారావు అధ్యక్షత వహించగా డీఎస్పీ పాల్గొని ప్రసంగించారు. ఉజ్వల భవిష్యత్తు కోసం తల్లిదండ్రుల పడుతున్న తపనను విద్యార్థినులు అవగాహన చేసుకోవాలన్నారు. విద్యార్థులంతా తొలుత అమ్మని గౌరవించడం నేర్చుకోవాలన్నారు. అమ్మని గౌరవించిన ప్రతిఒక్కరూ మహిళల పట్ల గౌరవంగా వ్యవహరిస్తారనే భావన ఆయన వ్యక్తం చేశారు. ఆకతాయిలు ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే సత్వరమే అలాంటి వారి సమాచారాన్ని స్కూల్ యాజమాన్యం ప్రోద్భలంతో పోలీసులకు అందించాలన్నారు. అలాంటి వారి సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని, సంబంధిత నేరస్తులకు తగిన శిక్ష విధిస్తామన్నారు. రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఎస్సై జి.నరేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండల పరిషత్ అధ్యక్ష ఎన్నిక వాయిదా



ఎంపీపీ అధ్యక్ష ఎన్నిక వాయిదా వేసినట్టు ప్రకటించిన డీఆర్వో రాజకుమారి

రాజోలు: మండల పరిషత్ అధ్యక్షుడు కేతా శ్రీనివాసరావు ఇటీవల మృతి చెందడంతో బుధవారం రాజోలు మండల పరిషత్ అధ్యక్ష ఎన్నిక నిర్వహించేందుకు జిల్లా రెవెన్యూ అధికారిణి, ఎన్నికల పరిశీలకురాలు రాజకుమారి ఏర్పాట్లు చేశారు. ఎన్నిక నిర్వహించేందుకు కనీసం ఏడుగురు సభ్యులు హాజరు కావాల్సి ఉంది. వైఎస్సార్ సీపీకి చెందిన ఎంపీటీసీలు నలుగురు, ఓ ఇండిపెండెంట్ ఎంపీటీసీలు హాజరయ్యారు. టీడీపీ, జనసేనలకు చెందిన ఎంపీటీసీలు ఒక్కరూ కూడా హాజరు కాలేదు. దీంతో సమావేశం నిర్వహించేందుకు కోరం సరిపడక పోవడంతో ఎన్నికను వాయిదా వేసినట్టు ఎన్నికల పరిశీలకురాలు రాజకుమారి తెలిపారు. ఈ నెల 17వ తేదీకి ఎన్నికను వాయిదా వేశామన్నారు.

అనుకున్నదొక్కటి.. అయినది ఒక్కటి..

రాజోలు ఎంపీపీ అధ్యక్ష ఎన్నిక విషయంలో అనుకున్నదొక్కటి.. అయినది ఒక్కటి చందాన ఎవరూ ఊహించని విధంగా వాయిదా పడింది. ఎంపీపీ అధ్యక్ష పదవి బీసీ జనరల్‌కు రిజర్వు కావడంతో టీడీపీకి చెందిన పొన్నమండ ఎంపీటీసీ-2 సభ్యురాలు కడలి శ్రీదుర్గను ఎంపీపీ అభ్యర్థిగా నామినేషన్ వేయించి ఏకగ్రీవంగా అధ్యక్ష పదవి కట్టబెట్టాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, టీడీపీ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం లక్కవరం ఎంజీ గార్డెన్స్‌లో జరిగిన సమావేశంలో నిర్ణయించారు. చివరి నిమిషంలో అధ్యక్ష ఎన్నికను వాయిదా వేయాలని టీడీపీ మంత్రి ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ను ఆదేశించడంతో అధ్యక్ష ఎన్నికకు టీడీపీ, జనసేన ఎంపీటీసీలు గైర్హాజరయ్యారు. అధ్యక్ష ఎన్నిక సమావేశానికి టీడీపీ, జనసేన ఎంపీటీసీలు ఎవరూ హాజరు కాకుండా ఎమ్మెల్యే దేవ ఆయన స్వగృహం వద్ద వారితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా తాటిపాక ఎంపీటీసీ-1 స్థానానికి ఎన్నికలు నిర్వహించి ఆ స్థానాన్ని కేతా శ్రీను భార్యను గెలిపించి ఆమెకే ఆ పదవిని కట్టబెట్టాలని శ్రీను అభిమానులు కోరుతున్నారు.

ఉత్తమ సేవలందించిన గురువులకు గుర్తింపు



మామిడికుదురులో సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు

మామిడికుదురు: ఉత్తమ సేవలందించిన గురువులకు విద్యార్థులు, పేరెంట్స్‌లో మంచి గుర్తింపు లభిస్తుందని ఎంఈఓ-2 మోకా వెంకన్నబాబు చెప్పారు. మామిడికుదురు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎంగా పని చేసి బదిలీ అయిన సీహెచ్ నిరంజనితో పాటు మరో అయిదుగురు ఉపాధ్యాయులను బుధవారం ఘనంగా సన్మానించారు. హెచ్ఎం బి.చిరంజీవిరావు అధ్యక్షతన జరిగిన సభలో ఉపాధ్యాయులకు పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు. విద్యార్థులను తీర్చిదిద్దడంతో పాటు పూర్వ విద్యార్థుల సహకారంతో హెచ్ఎంగా పని చేసిన నిరంజని హైస్కూల్‌ను అత్యుత్తమంగా తీర్చిదిద్దారని ఎంఈఓ-2 వెంకన్నబాబు చెప్పారు. ఆమె చేసిన సేవలు నిరంతరం గుర్తుండిపోతాయన్నారు. విద్యార్థులు, పేరెంట్స్ మన్ననలు అందుకున్నారని చెప్పారు. ఎస్ఎంసీ చైర్మన్ వేగి శ్రీనివాస్, ఉపాధ్యాయులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

• ప్రమాదం జరిగితేగాని స్పందించరా..



అంబాజీపేట: కె.పెదపూడి ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఓ భారీ వృక్షం వంటషెడ్‌పై ఒరిగి ప్రమాద భరితంగా ఉంది. వంట షెడ్ రేకులపై చెట్టు ఒరిగిపోయి వుండటంతో ఏ క్షణానా కూలిపోతుందోనని అక్కడ వంట చేసే మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. వంట షెడ్‌పై భారీ వృక్షం ఒరిగిపోయి ప్రమాద భరితంగా ఉందని స్థానిక పంచాయతీ అధికారికి, పాలక వర్గానికి, ఉన్నతాధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెను ప్రమాదం జరిగితే తప్ప ఎవరూ స్పందించరా అని స్థానికులు అధికారులను ప్రశ్నిస్తున్నారు.

కె.పెదపూడిలో వంటషెడ్డుపై ఒరిగిన భారీ వృక్షం

నేడు పోస్టాఫీసు నూతన భవనం ప్రారంభం

నెరవేరిన సొంత భవనం కల

రాజోలు: కొన్ని దశాబ్దాలుగా అద్దె భవనంలో సేవలు అందించిన రాజోలు హెడ్ పోస్టాఫీసుకు సొంత భవనం కల నెరవేరింది. శనివారం రాజోలు పోలీస్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో రూ.2.40 కోట్లతో నూతనంగా నిర్మించిన హెడ్ పోస్టాఫీసు నూతన భవనాన్ని కేంద్ర కమ్యూనికేషన్స్, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్‌లు ఈ నెల 17న ప్రారంభించనున్నారు. 2023 సెప్టెంబరు 30న అప్పటి ఎంపీ, ఎమ్మెల్యేలు చింతా అనురాధ, రాపాక వరప్రసాదరావులు పోస్టాఫీసు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రెండు దశాబ్దాల క్రితం భవన నిర్మాణానికి పోస్టల్‌శాఖ రూ.1.58 లక్షలు స్థల సేకరణ కోసం రెవెన్యూ శాఖకు చెల్లించింది. తొలుత రాజోలులోని వెంకటరమణ థియేటర్ ఎదురుగా ఉన్న దేవస్థానం భూమిని సేకరించేందుకు రెవెన్యూ అధికారులు ప్రయత్నాలు చేశారు. అయితే దేవదాయశాఖ భూముల సేకరణకు సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో స్థల సేకరణ జరగలేదు. అప్పటి నుంచి స్థలసేకరణ విషయం పట్టించుకున్నవారే లేరు. త్వరితగతిన స్థల సేకరణ చేయాలని అప్పటి ఎమ్మెల్యే రాపాక రెవెన్యూ ఉన్నతాధికారులకు లేఖ రాయడంతో స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వెనుక ఉన్న స్థలంలో సుమారు 10 సెంట్ల భూమి పోస్టల్ శాఖకు కేటాయించారు. దీంతో అప్పటి ఎంపీ చింతా అనురాధ ద్వారా పోస్టాఫీసు భవనానికి రూ.2.40 కోట్ల నిధులు విడుదల చేశారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టు భర్తీకి దరఖాస్తులు

కొత్తపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న సివిక్స్ లెక్చరర్ పోస్టును అతిథి(గెస్ట్) లెక్చరర్‌తో భర్తీ చేయుటకు దరఖాస్తులు కోరుతున్నట్టు ప్రిన్సిపాల్ యాళ్ల లక్ష్మణరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి సంబంధిత సబ్జెక్ట్‌లో పీజీ చేసి, 50 శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తుతో పాటు మార్కుల లిస్టు, జెరాక్స్ కాపీలతో రెండు సెట్లు ఈ నెల 18వ తేదీ సాయంత్రం 4 గంటల్లోపు కళాశాలలో అందజేయాలని కోరారు.

చిన్నారులకు టీకాలు

ఆలమూరు: చిన్నారులకు నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.మల్లికార్జున్ అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలు అందజేశారు. వైద్యాధికారుల ఆధ్వర్యంలో ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, సీహెచ్ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, ఆర్.బాలామణి వైద్యసేవలను పర్యవేక్షించారు. పెదపళ్ల, చింతలూరు, పెనికేరు, చొప్పెల్ల, చెముడులంక, మడికి, గుమ్మిలేరు, నర్శిపూడి గ్రామాల్లో చిన్నారులకు టీకాలు, బాలింతలకు, గర్భిణులకు ఇంజక్షన్లు అందజేశారు. ధనుర్వాతం, కామెర్లు, క్షయ, పోలియో, డిఫ్తీరియా, కోరింత దగ్గు నివారణకు టీటీ, డీపీటీ, మీజిల్స్, పెంటావాలెంట్, ఎంఆర్, హెపటైటిస్-బీ వ్యాక్సిన్లను అందజేశారు. బాలింతలకు, గర్భిణులకు బలవర్ధక ఔషధాలను, యాంటీ బయాటిక్ మందులను అందజేశారు. హెల్త్, అంగన్‌వాడీ, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల షాపుల్లో విజిలెన్స్ అధికారుల తనిఖీ



అంబాజీపేటలో ఎరువుల షాపును తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

అంబాజీపేట: మండలంలో ఉన్న ఎరువుల షాపులను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎరువులు, పురుగుల మందుల షాపులను తనిఖీ చేస్తున్నట్లు స్టేట్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏడీఏ ఎల్‌వీ మధు, సీఐ డీవీవీ సతీష్‌కుమార్‌లు తెలిపారు. అంబాజీపేటలో ఉన్న విజయలక్ష్మి ఎరువులు, పురుగు మందుల షాపులో ఆకస్మిక తనిఖీ చేశారు. షాపులో ఉన్న రికార్డులను, గొడౌన్లను, ఎరువులు, పురుగుల మందులను తనిఖీ చేశారు. వాటికి సంబంధించిన బిల్లులను, షాపు లైసెన్స్‌లను పరిశీలించారు. తనిఖీలో భాగంగా పి.గన్నవరం, రావులపాలెం, ఆత్రేయపురం, లొల్లలో ఉన్న ఎరువుల షాపులను తనిఖీ చేసినట్లు వారు తెలిపారు. వీరి వెంట మండల వ్యవసాయాధికారి కె.ధర్మప్రసాద్, ఏఈఓ జాబేజ్‌శాస్త్రి ఉన్నారు.

పలువురికి జగ్గిరెడ్డి పరామర్శ



గంటిలో శ్రీహరికి నివాళులర్పిస్తున్న జగ్గిరెడ్డి

కొత్తపేట: మండలంలోని గంటి గ్రామంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకుల కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే, జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి బుధవారం పరామర్శించారు. గంటి పంచాయతీ పరిధిలో వివిధ ప్రాంతాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు పంతగాని శామ్యూల్, యన్నపు శ్రీహరి ఇటీవల మృతి చెందారు. జగ్గిరెడ్డి ఆయా మృతుల ఇళ్లకు వెళ్లి, వారి చిత్రపటాల వద్ద పుష్పాలుంచి, ఘనంగా నివాళులర్పించారు. ఆయా కుటుంబాలను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. జగ్గిరెడ్డి వెంట జిల్లా పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీటీసీ సభ్యుడు ముళ్ల జనార్దనరావు, ఎంపీటీసీ మాజీ సభ్యులు పోలుమాటి అంజనీకుమారి, భూపతిరాజు సత్యనారాయణరాజు, నేరేడుమిల్లి నరేష్ ఉన్నారు.

స్కూల్ వ్యాన్ డ్రైవర్లతో సమావేశం

మలికిపురం: మండల విద్యాశాఖ, పోలీస్, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మలికిపురంలో బుధవారం ప్రైవేట్ విద్యాసంస్థల వాహనాల డ్రైవర్లతో అవగాహన సదస్సు జరిగింది. ఎంఈఓ విజయశ్రీ మాట్లాడుతూ విద్యార్థులు ఇంటికి సేఫ్‌గా వెళ్లే వరకు బాధ్యత స్కూల్ యాజమాన్యానిదేనన్నారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన మలికిపురం ఎస్సై సురేష్ మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్, వెహికల్ ఇన్సూరెన్స్, ఓవర్ స్పీడ్, లోడ్ చేయడం కరెక్ట్ కాదని, ఏదైనా ప్రమాదం జరిగితే చాలా బాధపడవలసి వస్తుందన్నారు.

ఉత్తమ వైద్య సేవలకు సమాజంలో గుర్తింపు



అవిడిలో డాక్టర్ ఇందిరాభారతిని సత్కరిస్తున్న ఎంపీపీ మార్గన, సర్పంచ్‌లు

కొత్తపేట: సంపూర్ణ ఆరోగ్య సమాజమే లక్ష్యంగా పనిచేసిన వైద్యులు, సిబ్బందికి సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. మండలంలోని అవిడి పీహెచ్‌సీ వైద్యులుగా పనిచేసి వివిధ ప్రాంతాలకు బదిలీ అయిన డాక్టర్లు రవికుమార్, ఇందిరాభారతిలతో పాటు, ఎంపీహెచ్ఈఓలు బీవీవీ సత్యనారాయణ, సీహెచ్ వెంకటేశ్వరరావు, పీహెచ్ఎన్ సుగుణ, పలువురు ఏఎన్ఎంల వీడ్కోలు సన్మానం బుధవారం ఘనంగా నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.శ్రీదివ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ మార్గన గంగాధరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది ఉత్తమ సేవలు అందించారని బదిలీ అయిన వైద్యులను అభినందించారు. అనంతరం బదిలీ అయిన వైద్యులు, సిబ్బందిని పీహెచ్‌సీ తరఫున, ఎంపీపీ మార్గన, సర్పంచ్‌లు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అవిడి, మోడేకుర్రు సర్పంచ్‌లు రెడ్డి చంటి, కుడుపూడి రామలక్ష్మి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సొసైటీ మాజీ చైర్మన్ 'ముక్కామల' మృతి

పి.గన్నవరం: ముంగండ సొసైటీ మాజీ చైర్మన్, బీజేపీ సీనియర్ నాయకుడు ముక్కామల సుబ్రహ్మణ్యేశ్వర శాస్త్రి (80) మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో మృతి చెందారు. బుధవారం ఉదయం ముంగండలో ఆయన పార్థివ దేహానికి బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు మానేపల్లి అయ్యాజీ వేమా, నాయకులు తదితరులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. శాస్త్రి మృతి తీరని లోటని వేమా అన్నారు.